# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ లో భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక వినియోగాన్ని పెంపొందించేందుకు 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు.**

**3.** **విద్య ద్వారా గొప్ప మార్పు సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**4.** **ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు నుంచి రైతు వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.**

**5.** **అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది సంక్షేమ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

===========================

ఆంధ్రప్రదేశ్ లో భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభల ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బాపట్ల జిల్లాలోని పూడివాడ గ్రామంలో రీ సర్వే పూర్తైన భూములకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి నిన్న పంపిణీ చేశారు. భవిష్యత్తులో వివాదాలు లేకుండా భూముల రీ సర్వే ద్వారా రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా శాంతినగర్--ఏలేశ్వరవారిపాలెం బీటీ రోడ్డుతో పాటు ఉప్పలపాడు, మైలవరం, వేంపర గ్రామాల్లో నిర్మించిన కచ్చా రహదారులను ప్రారంభించారు. అనంతరం ఉప్పలపాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అలాగే, అద్దంకి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో 591 మార్కులు సాధించిన ఝాన్సీ అనే విద్యార్థినిని మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

విద్య ద్వారా ఉన్నతమైన మార్పు సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థుల కోసం కార్పోరేట్ సామాజిక బాధ్యత –సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన 253 ఉచిత సైకిళ్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో పదవ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక వినియోగాన్ని పెంపొందించేందుకు గ్రామ సంఘాల సహాయకులకు 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో 178 మందికి స్మార్ట్ ఫోన్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. అనంతరం జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల రికార్డులను డిజిటలీకరణ చేయడం, రుణాలు, ప్రభుత్వ పథకాల వివరాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఫోన్లు ఉపయోగపడతాయని తెలిపారు. వీటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు నుంచి 9వ తేదీ వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూరులో ఈ వారోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా మట్టి సారం, సహజ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామని అన్నారు. అలాగే మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు అధికారులు సూచనలు ఇస్తారని తెలిపారు. సౌరశక్తి వినియోగంపై అవగాహన కల్పిస్తామని.. పశువుల ఆరోగ్యం, చేపల ఉత్పత్తిపై రైతులకు శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. వర్షాకాలానికి ముందస్తు సాగునీటి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు నగరంలో 5 వేల 500 కోట్ల రూపాయలతో మురుగు నీటి వ్యవస్థ, తాగునీటి పథకాల అభివృద్ధి పనులను చేపట్టామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన అధికారులుతో కలిసి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నెల్లూరు నగరాన్ని చండీగఢ్ తరహాలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నెల్లూరులోని ప్రభుత్వ, నగరపాలక సంస్థల ఉన్నత పాఠశాలలను ఆధునీకరిస్తామని మంత్రి వెల్లడించారు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో అనకాపల్లి--చర్లపల్లి ఎక్స్ ప్రెస్ రైలును అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజల

అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూడు కొత్త రైళ్లను మంజూరు చేయించామని తెలిపారు. అనకాపల్లి--తిరుపతి, అనకాపల్లి--సోలాపూర్ రైలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. జిల్లాలో రైల్వే కనెక్టివిటీ పెరగడం వల్ల ఉద్యోగ, వ్యాపార, విద్య రంగాలకు మేలు జరుగుతుందని తెలుపుతూ,

వాయిస్ ...25.. సెకన్లు

---------------------------

అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది సంక్షేమ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ధైర్య సాహసాలను, విజయాలను, త్యాగాలను గుర్తించడం, అగ్నిమాపకశాఖ ద్వారా ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించి... తద్వారా అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1999వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 4వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. 1998 డిసెంబర్ 2వ తేదీన ఆస్ట్రేలియాలో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం అగ్నిమాపక సిబ్బంది సేవలను గుర్తించాలని కాంక్షిస్తూ... ప్రతి ఏటా మే 4వ తేదీన అగ్నిమాపక సిబ్బంది సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది.

మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా ద్రోణి విస్తరించి ఉందని దీని ప్రభావంతో రాష్ట్రంలోని అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం గొప్ప సేవ అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి మైదానంలో నిర్వహించిన "ఉచిత కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని" ఆంధ్రప్రదేశ్ ప్రరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తో కలిసి గవర్నర్ నిన్న ప్రారంభించారు.

=====================